



ప్రభాత సూర్య

PRABHATA SURYA

తెలుగు దిన పత్రిక

www.suryaa.news

హైదరాబాద్

24-5-2026

వెల: రూ.5/-


పేజీలు: 8

సంపుటి: 09

సంచిక: 255

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD


# యాదగిరిగుట్టలో సిఎం పర్యటన



## వందకోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

## రూ.43.80 కోట్లతో వేదపాఠశాలకు భూమిపూజ

**యాదగిరిగుట్ట, ప్రభాత సూర్య :** యాదగిరిగుట్టలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా రూ.100 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.

2లో

## గోదావరి పుష్కరాలకు వేయికోట్లు

జూనియర్ కాలేజీల్లో మహధ్యాహ్న భోజనం

గంగాధర కాలేజీలో పోస్టుల భర్తీకి ఆమోదం

కేసముద్రం ఫైర్‌స్టేషన్‌కు 18 పోస్టుల మంజూరు

తెలంగాణ కేబినెట్కీలక నిర్ణయం

## జూన్ 2న కొత్త పింఛన్లు?!

రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇల్లు సైతం

తెలంగాణ సర్కార్ కీలక నిర్ణయం



**హైదరాబాద్:** తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయాలు దిశగా అడుగులు వేస్తోంది. కీలకమైన మూడు నిర్ణయాలను తీసుకుంది. కొత్త పింఛన్లతో పాటు ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డుల జారీకి సంబంధించి తీపి కబురు చెప్పింది. ఇప్పటికే పెద్ద ఎత్తున దరఖాస్తు

మిగతా 2,3లో

## హైదరాబాద్ నడిబొడ్డున ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటు

రేవంత్ వ్యూహాత్మక రాజకీయం



**తెలంగాణ బ్యూరో :** తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. సరికొత్త పొలిటికల్ గేమ్ ఆడుతున్నారు. తెలంగాణలో టిడిపి ఓటు బ్యాంకును పదిలం చేసుకునేందుకు ఆయన గట్టిగానే ప్రయత్నాలు

మిగతా 2లో


## తెలంగాణ ఎండల తీవ్రతపై ప్రభుత్వం అలర్ట్

వడదెబ్బకు 16 మంది మృతి చెందినట్లు గుర్తింపు

మృతుల కుటుంబాలకు 4లక్షల చొప్పున పరిహారం

పరిస్థితిపై అధికారులతో మంత్రి పొంగులేటి సమీక్ష

**హైదరాబాద్, ప్రభాత సూర్య :** రాష్ట్రవ్యాప్తంగా హీట్ వేవ్‌పై హై అలర్ట్ ప్రకటించినట్లు తెలంగాణ రెవెన్యూ, సమాచారశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. తీవ్ర ఉష్ణోగ్రతలపై మంత్రి పొంగులేటి సచివాలయంలో శనివారం అత్యవసర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు కీలక అంశాలపై మంత్రి దిశానిర్దేశం చేశారు.



## యువత ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలి

దేశవ్యాప్తంగా రోజ్‌గార్ మేళాలో 51 వేల మందికి ఉద్యోగాలు

ఇప్పటివరకు 12.5 లక్షల మందికి ఉద్యోగావకాశాలు

19వ రోజ్‌గార్ మేళాలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

**హైదరాబాద్ ప్రభాత సూర్య :** దేశవ్యాప్తంగా 47 ప్రాంతాల్లో జరిగిన రోజ్‌గార్ మేళాలో 51 వేల మందికి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు.



## మమతా బెనర్జీకి షాక్!



ఆమె ప్రవేశపెట్టిన మతపరమైన పథకాలకు బ్రేక్

సంచలన నిర్ణయాలు దిశగా కొత్త ప్రభుత్వం

బెంగాల్లో మమతకు షాక్ ట్రీట్మెంట్ ఇవ్వడం ప్రారంభించారు ముఖ్యమంత్రి సువేందు అధికారి. మమతా బెనర్జీ హయాంలో అమలు చేసిన మతపరమైన

# స్థానిక ఎన్నికల బహిష్కరణ!

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వ్యూహాత్మక ఎత్తుగడ

ఇప్పటికీ యాక్టివ్ కానీ నియోజకవర్గ ఇన్చార్జిలు

ఎన్నికల్లో పోటీకి ద్వితీయ శ్రేణి నేతల విముఖత

ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. భారీ సంక్షేమ పథకాల ప్రకటన తరువాత ఎన్నికల ప్రక్రియకు వెళ్లే అవకాశం ఉంది. వచ్చే జూన్ లో తల్లికి వందనం పథకం అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. మత్స్యకార భరోసా కింద నిధుల విడుదలకు కూడా నిర్ణయించింది. అన్నదాత సుఖీభవ నిధులు కూడా జమ చేయనుంది.



2లో

**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:** జూన్ 12న కొత్త పింఛన్ల జారీకి నిర్ణయించింది. కూటమి అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు పూర్తవుతున్న తరుణంలో కొత్త పింఛన్లకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇవన్నీ పూర్తయిన తర్వాత స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అడుగులు వేయనుంది కూటమి ప్రభుత్వం. అయితే ప్రభుత్వ దూకుడు చూసి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది.

## ప్రమాదాల సమయంలో 'గోల్డెన్ అవర్'కీలకం

తక్షణం స్పందిస్తే ప్రమాదాల నివారణ సాధ్యం

మాక్ డ్రిల్ ప్రారంభించిన మంత్రి పొంగులేటి



హైదరాబాద్: ప్రకృతి విపత్తుల సమయంలో ప్రజల ప్రాణాలను కాపాడడం, వీలైనంత వరకూ ఆస్తులకు నష్టం కలగకుండా చూడడమే లక్ష్యంగా ప్రభుత్వ పనిచేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. సిఎం రేవంత్ రెడ్డి సూచనల మేరకు ప్రపంచస్థాయి సాంకేతికతతో విపత్తు రక్షణ వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా

2లో



## బండి సంజయ్ జపం చేస్తున్న బీఆర్ఎస్!

బిజెపిని దెబ్బతీసేందుకు గులాబీ పార్టీ వ్యూహం

వ్యక్తిగత, కుటుంబ వ్యవహారాలతో తెలంగాణలో నిలదొక్కుకునే ప్రయత్నం

వర్కౌట్ కాదంటున్న విశ్లేషకులు



**తెలంగాణ బ్యూరో :** తెలంగాణలో ఇప్పుడు బండి సంజయ్ చుట్టూ రాజకీయం వాతావరణం తిరుగుతోంది. ఆయన కుమారుడి పై నమోదైన ఫోక్సో కేసును అస్త్రంగా చేసుకుని గులాబీ పార్టీ దాడి చేస్తోంది.

# యాదగిరిగుట్టలో సీఎం పర్యటన

శనివారం ఉదయం యాదగిరిగుట్టకు చేరుకున్న సీఎం రేవంత్ శ్రీలక్ష్మీనర్సింహ స్వామిని దర్శించుకున్నారు. అనంతరం రూ.43.80 కోట్లతో నిర్మించనున్న వేద పాఠశాలకు రేవంత్ శంకుస్థాపన చేశారు. కంచి కామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతితో కలిసి వేదపాఠశాలకు భూమిపూజ చేశారు. అనంతరం రూ.9.87 కోట్లతో కొండపై స్వామివారి నిత్య కల్యాణ మండపం నిర్మాణానికి, రూ.1.41 కోట్లతో వైకుంఠ ద్వారం నుంచి కొండపైకి వెళ్లే మెట్ల మార్గం పై కప్పు నిర్మాణానికి, రూ.1.35 కోట్లతో నిర్మించనున్న రథశాల వైపు మాడవీధులకు మెట్ల నిర్మాణానికి, రూ.43.12 కోట్లతో డార్మిటరీ హాల్స్, దీక్షాపరుల సదన్ నిర్మాణానికి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ఉదయం ప్రత్యేక హెలికాప్టర్లో యాదగిరిగుట్ట పెద్దగుట్టపైకి చేరుకున్న సీఎం రేవంత్ రెడ్డికి.. ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, కలెక్టర్ అనురాగ్ జయంతి ఘన స్వాగతం పలికారు. సీఎంతో పాటు శాసనమండలి చైర్మన్ గుత్త సుఖేందర్ రెడ్డి, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, అడ్లూరి లక్ష్మణ్, ఎంపీ వేంనరేందర్ రెడ్డి.. యాదాద్రికి చేరుకున్నారు. పవిత్ర పుణ్యక్షేత్రం యాదగిరిగుట్టపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంప్రదాయ వేదపాఠశాల భవనానికి శంకుస్థాపన చేశారు. కంచి కామకోటి పీఠాధిపది శ్రీశంకర విజయేంద్ర సర్వస్వతి స్వామి సమక్షంలో ఈ క్రతువు జరిగింది. రూ.43.79 కోట్లతో క్షేత్రంలోని పెద్దగుట్ట ఆలయ నగరి లేఅవుట్ వద్ద 15 ఎకరాల విస్తీర్ణంలో వేదపాఠశాల భవనం నిర్మించనున్నారు. వచ్చే రెండేళ్లలో నిర్మాణం పూర్తి చేసి తరగతులు ప్రారంభించనున్నారు. అనంతరం శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారిని సీఎం దర్శించుకున్నారు.

# స్థానిక ఎన్నికల బహిష్కరణ!

వివిధ కారణాలు చెబుతూ స్థానిక సంస్థల ఎన్నికల బహిష్కరణ వైపు మొగ్గు చూపుతున్నట్లు సమాచారం.

**చాలా ఇబ్బందికరం..:** ఇప్పుడు ఉన్న పరిస్థితుల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు స్థానిక సంస్థల ఎన్నికలను ఎదుర్కోవడం ఇబ్బందికరమే. ఇప్పటికే ప్రజల్లో ప్రభుత్వం పై ఒక రకమైన సంతృప్తి కనిపిస్తోంది. సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధికి సమ ప్రాధాన్యం ఇస్తోంది ప్రభుత్వం. రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు వస్తున్నాయి. పరిశ్రమలు వస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో నిరుద్యోగ యువతలో కూడా సంతృప్తి వ్యక్తం అవుతుంది. గ్రామాల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి కూడా జరుగుతోంది. అనవసరంగా ఎన్నికలకు వెళ్లి చేతులు కాల్చుకోవడం కంటే.. ఎన్నికల బరి నుంచి తప్పుకుంటే మేలన్న నిర్ణయానికి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు వచ్చాయి. అందుకే ఏమో ఒక కారణాలు చెబుతూ ఎన్నికల బహిష్కరణకే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మొగ్గు చూపే అవకాశం ఉంది.

**నియోజకవర్గానికి దూరంగా నేతలు..:** రాష్ట్రవ్యాప్తంగా చాలా నియోజకవర్గాల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు యాక్టివ్ కాలేదు. కొందరైతే అసలు నియోజకవర్గాలకే అందుబాటులో లేరు. వైసీపీకి చెందిన కీలక నేతలు బయట రాష్ట్రాల్లో వ్యాపారాలు చేసుకుంటున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో స్థానిక సంస్థల కోసం ఆసక్తి చూపే నేతలకు అండగా నిలిచే వారు కూడా కరువవుతున్నారు. పైగా స్థానిక సంస్థల ఎన్నికలంటే పెట్టుబడితో కూడుకున్న పని. పైగా ఎవరైనా నాయకులు స్థానిక సంస్థల ఎన్నికలకు నిలబడితే నియోజకవర్గం డబ్బులు సర్దుబాటు చేయాల్సి ఉంటుంది. అందుకు వైసిపి నేతలు సిద్ధంగా లేరు. ఒకవేళ స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిచినా ఉత్సవ విగ్రహాలు తప్ప ప్రజలకు చేసింది ఏమీ ఉండదు. ఈ కారణంతోనే ఎక్కువమంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ద్వితీయ శ్రేణి నాయకత్వం ఎన్నికలకు దూరంగా ఉండాలని భావిస్తోంది. ఈ విషయాన్ని గమనించిన వైసీపీ నాయకత్వం సైతం ఎన్నికల బహిష్కరణ ఉత్తమం అన్న నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. చూడాలి మరి ఏం జరుగుతుందో...

# జూన్ 2న కొత్త పింఛన్లు?!

చేసుకున్న వారు ప్రభుత్వ నిర్ణయం కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. మరోవైపు బడ్జెట్లో రెండు లక్షల పెన్షన్లతోపాటు రేషన్ కార్డుల పంపిణీకి నిధులు కేటాయించారు. ఇప్పుడు తాజాగా ఆ రెండింటిపై ప్రభుత్వం ముహూర్తం నిర్ణయించింది. దరఖాస్తులు అర్హతలపై నిర్ణయం తీసుకుంది. తెలంగాణ అవతరణ దినోత్సవం సందర్భంగా జూన్ రెండు నుంచి 2 లక్షల మందికి కొత్త పింఛన్లు మంజూరు చేస్తామని కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ ప్రకటించారు.

**దరఖాస్తులు సైతం..:** కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్త పింఛన్ల మంజూరు తో పాటు రేషన్ కార్డులపై ప్రకటనలు ఇస్తూ వచ్చింది. దరఖాస్తుల స్వీకరణ కూడా జరిగింది. ఇప్పుడు అధికారంలోకి వచ్చి దాదాపు రెండున్నర సంవత్సరాలు దాటుతున్న క్రమంలో కాంగ్రెస్ సర్కార్ ఈ కీలక నిర్ణయం తీసుకుంది. మరోవైపు రాష్ట్ర వ్యాప్తంగా తొలి విడత ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తయింది. ఇప్పుడు రెండో విడతకు తెలంగాణ సర్కార్ సన్నాహాలు చేస్తోంది. అన్నింటికీ మించి పింఛన్ల ప్రక్రియకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో.. లక్షలాదిమంది దరఖాస్తుదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

**కొత్తగా రెండు లక్షల మందికి..:** ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా పెన్షన్ లబ్ధిదారులు 42 లక్షల మందికి పైగా ఉన్నారు. కొత్తగా 2 లక్షల మందికి ఆమోదం ఇచ్చినట్లు మంత్రి చెబుతున్నారు. 2026-27 ఆర్థిక సంవత్సరంలో మరో రెండు లక్షల పెన్షన్లకు నిధులు కేటాయించి.. జూన్ 2 నుంచి అమలు చేయాలని తెలంగాణ సర్కార్ నిర్ణయించింది. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, చేనేత, గీత కార్మికులు, హెచ్ఐవి బాధితులు, దివ్యాంగులు వంటి వర్గాలకు కొత్తగా పెన్షన్ దక్కనుంది. ప్రస్తుతం వృద్ధులు వితంతువులు మొదలైన వారికి నెలకు రూ.2016, దివ్యాంగులకు రూ.4016 అందిస్తోంది. కాంగ్రెస్ తన మేనిఫెస్టోలో పెన్షన్ ను 4000 రూపాయలకు పెంచనున్నట్లు హామీ ఇచ్చింది. అది ఎంతవరకు అమలు కాలేదు. అయితే ఇప్పుడు రేషన్ కార్డులతో పాటు పింఛన్లు, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకు రావడం శుభ పరిణామం.

# తెలంగాణ ఎండల తీవ్రతపై ప్రభుత్వం అలర్ట్

వడగాల్పులతో 7 జిల్లాల్లో 16 మంది మృతిచెందారని తెలిపారు. మృతుల కుటుంబాలకు రూ.4 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇస్తున్నట్లు ప్రకటించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో నష్టపరిహారం ఇస్తున్నామని స్పష్టం చేశారు. వచ్చే మూడు రోజులు మరింత తీవ్రంగా హీట్ వేవ్ ఉండనుందని తెలిపారు. జిల్లా కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని మార్గనిర్దేశర చేశారు. ప్రజల ప్రాణ రక్షణెళి తమ ప్రభుత్వ తొలి ప్రాధాన్యమని తెలిపారు. వడగాల్పులతో ఒక్క ప్రాణం కూడా కోల్పోకూడదని చెప్పుకొచ్చారు. ఎండ తీవ్రతపై ప్రజలకు గంట గంటకు హెచ్చరికలు జారీ చేశామని మంత్రి పొంగులేటి తెలిపారు. ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ప్రజలు బయటకు రావొద్దని సూచించారు. వృద్ధులు, గర్భిణులు, చిన్నారులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. వ్యవసాయ, భవన నిర్మాణ కార్మికులు ప్రత్యేక రక్షణ చర్యలు చేపట్టాలని నిర్దేశిరచారు. హీట్‌వేవ్‌పై గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఎండదెబ్బకు గురైన వ్యక్తులకు ఆయా ఆస్పత్రులు అత్యవసర చికిత్స అందించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఇదిలావుంటే తెలంగాణలో భానుడి భగభగలు తీవ్రరూపం దాల్చాయి.

# గోదావరి పుష్కరాలకు వేయికోట్లు

(మొదటి పేజీ తరువాయి)

**హైదరాబాద్, ప్రభాత సూర్య :** వచ్చే ఏడాది గోదావరి పుష్కరాల నేపథ్యంలో.. సంబంధిత పనులకు రూ.వెయ్యి కోట్ల కేటాయిస్తూ తెలంగాణ మంత్రివర్గం ఆమోదం తెలిపింది. తొలి విడతగా రూ.300 కోట్ల మంజూరుకు పచ్చజెండా ఊపింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ భేటీలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. జూనియర్ కళాశాలల్లోనూ మధ్యాహ్న భోజనం పథకం అమలుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో అల్పాహారం, పాలు అందించాలని నిర్ణయించింది. అస్సాం రైఫిల్స్, బీఎస్ఎఫ్, సీఐఎస్ఎఫ్ సెంటర్ల ఏర్పాటుకు కరీంనగర్ జిల్లాను ఎంపిక చేసింది. కేసముద్రం ఫైర్‌స్టేషన్‌కు 18 పోస్టుల మంజూరుకు అంగీకారం తెలిపింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన తెలంగాణ కేబినెట్ శనివారం భేటీ అయ్యింది. రాష్ట్రానికి సంబంధించి పలు అంశాలపై మంత్రిమండలి చర్చించింది. ఈ సందర్భంగా కీలక నిర్ణయాలు తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేసేందుకు క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పాఠశాలలతో పాటు జూనియర్ కళాశాలల్లోనూ విద్యార్థులకు ఉదయం అల్పాహారం, పాలు అందించాలని మంత్రిమండలి నిర్ణయించింది. 2027 గోదావరి పుష్కరాల పనులకు రూ.1,000 కోట్లు కేటాయిస్తూ తెలంగాణ క్యాబినెట్ ఆమోదం తెలిపింది. తొలివిడతగా రూ.300 కోట్లు మంజూరుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మరోవైపు నిరుద్యోగ యువతకూ మంత్రిమండలి గుడ్ న్యూస్ చెప్పింది.



కరీంనగర్ జిల్లా గంగాధరలోని డిగ్రీ కళాశాలలో నియామకాలకు పచ్చజెండా ఊపింది. 20 రెగ్యులర్ టీచింగ్ పోస్టులు, 6 నాన్ టీచింగ్ పోస్టులు, అవుట్ సోర్సింగ్ పద్ధతిన మరో 3 పోస్టుల మంజూరుకు ఆమోదం తెలిపింది. మహబూబాబాద్ జిల్లా కె.సముద్రం అగ్నిమాపక కేంద్రానికి సంబంధించి 18 పోస్టులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

# యువత ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలి

యువత స్వయం సమృద్ధి సాధించి ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. శనివారం నాడు బోయిగూడలోని రైల్ కళారంగ్‌లో జరిగిన 19వ రోజ్‌గార్ మేళాలో కేంద్ర మంత్రి పాల్గొని ప్రసంగించారు. ఈరోజు 220 మంది కొత్తగా ఉద్యోగాల్లో చేరుతున్నారన్నారు. 2022లో దీపావళి రోజున మొదలైన రోజ్‌గార్ మేళా ద్వారా ఇప్పటివరకు 12.5 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించామని వెల్లడించారు. ఇది కేవలం ఉద్యోగాల కార్యక్రమం కాదని, యువత భవిష్యత్తు కోసం మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన పెద్ద మిషన్ అని చెప్పుకొచ్చారు. ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు ప్రైవేట్ కంపెనీల్లో కూడా కోట్ల సంఖ్యలో ఉద్యోగాలు వస్తున్నాయని అన్నారు. స్టార్టప్స్, యూనికార్న్ వల్ల యువత ఉద్యోగాలు అడిగే స్థాయి నుంచి ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి వచ్చిందని కేంద్రమంత్రి అన్నారు. రోడ్లు, ఎయిర్‌పోర్టులు, రైల్వేలు, మెట్రోలు, ఇండస్ట్రియల్ కారిడార్లు వంటి ప్రాజెక్టులతో భారీగా ఉపాధి పెరుగుతోందన్నారు. దేశంలో ప్రతి సంవత్సరం రూ.12 లక్షల కోట్ల ఇన్‌ఫ్రా పనులు జరుగుతున్నాయని వివరించారు. ప్రతి లక్ష కోట్ల పెట్టుబడికి 14 నుంచి 15 లక్షల ఉద్యోగాలు వస్తున్నాయన్నారు. యువతను మోదీ 'వికసిత భారతానికి సూపర్ హీరోలు'గా చూస్తున్నారని అన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా కోట్ల మంది యువతకు శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. గ్రామీణ యువతకు కూడా ఒఎ, ఎని వంటి ఆధునిక టెక్నాలజీని మాతృభాషలో నేర్పిస్తున్నామని తెలిపారు.

భారత యువత ప్రపంచస్థాయిలో రాణిస్తోందని కిషన్ రెడ్డి అన్నారు. సెమికండక్టర్లు, స్పేస్, డ్రోన్ టెక్నాలజీలో భారత్ ముందుకు వెళ్తోందన్నారు. చంద్రుడి దక్షిణ ధృవానికి ముందుగా చేరిన దేశం భారత్ అని చెప్పుకొచ్చారు. 'ఆపరేషన్ సిందూర్' సమయంలో స్వదేశీ డ్రోన్లు శత్రు క్షిపణులను అడ్డుకున్నాయని

అన్నారు. 2047 నాటికి వికసిత భారత్ లక్ష్య సాధనలో యువత పాత్ర కీలకమన్నారు. యూనివర్సిటీలు, కాలేజీలు, పీఎం-శ్రీ స్కూల్స్ సంఖ్య పెంచామని తెలిపారు. భారత్ ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగిందని అన్నారు. 2014కు ముందు వందల స్టార్టప్స్ మాత్రమే ఉండగా, ఇప్పుడు 1.2 లక్షలకు పైగా ఉన్నాయన్నారు. మైనింగ్, బొగ్గు రంగాల్లో కూడా మంచి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని యువతకు సూచించారు. మైనింగ్, ఇంజనీరింగ్ వంటి కోర్సులపై యువత దృష్టి సారించాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సూచనలు

# మమతా బెనర్జీకి షాక్!

పథకాలను నిలిపివేస్తూ నిర్ణయం తీసుకున్నారు. దీంతో మమత బెనర్జీ టీం ఆత్మరక్షణలో పడింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కొత్త ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటోంది. సంక్షేమ పథకాల అమలుకు సైతం సిద్ధమవుతోంది. సోమవారం రెండోసారి క్యాబినెట్ సమావేశం జరిగింది. జూన్ 1 నుంచి సంక్షేమ పథకాలు అమలు చేయాలని నిర్ణయించారు.

**అన్నపూర్ణ పథకం అమలు..**

ప్రధానంగా అన్నపూర్ణ పథకం అమలు చేసేందుకు బిజెపి కొత్త ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అర్హులైన మహిళలకు ఈ పథకం కింద నెలకు రూ.3000 ఆర్థిక సాయం అందిస్తారు. ప్రభుత్వ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రవేశం కల్పిస్తారు. ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమం కోసం 7వ వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేయాలని కూడా నిర్ణయించారు. ప్రధానంగా మతపరంగా అందించే సంక్షేమ పథకాలను రద్దు చేస్తూ నిర్ణయించారు. దీని ప్రకారం మదర్సాలకు అందించే సాయం ఆగిపోయా అవకాశం ఉంది. అదే సమయంలో సిఏఏ చట్టం కింద భారత పౌరసత్వం కోసం దరఖాస్తు చేసుకున్న మహిళలకు సంక్షేమ పథకాలు అందిస్తామని బెంగాల్ మంత్రి అగ్ని మిత్ర పాల్ ప్రకటించారు.

**వేతన సవరణకు సంఘం..**

ఇప్పటికే బెంగాల్లో లక్ష్మీ భండార్ పథకం అమలు అవుతుంది. ఈ పథకం లబ్ధిదారులు ఎటువంటి దరఖాస్తు చేసుకునే అవకాశం లేకుండా.. నేరుగా అన్నపూర్ణ పథకానికి అర్హత పొందేలా చూస్తారు. దీనికోసం ప్రత్యేక పోర్టల్ కూడా ప్రారంభిస్తారు. అయితే ప్రధానంగా ఉద్యోగుల్లో విశ్వాసాన్ని పొందేందుకుగాను కొత్త ప్రభుత్వం వేతన సవరణకు సంబంధించిన సంఘాన్ని ఏర్పాటు చేయబోతున్నట్లు ప్రకటించింది. దీనిపై ప్రభుత్వ ఉద్యోగులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ఓబీసీలకు అందించే పథకాల అమలుకు కొత్త కమిషన్ ఏర్పాటు చేయబోతున్నారు. త్వరలో ప్రభుత్వం కొత్త ఎలక్ట్రిక్ బస్సులను కొనుగోలు చేయనుంది. కేంద్రంతో కలిసి ఆయుష్మాన్ భారత్ పథకాన్ని అమలు చేయబోతున్నట్లు ఇటీవల కొత్త ముఖ్యమంత్రి సువెందు అధికారి ప్రకటించిన సంగతి తెలిసిందే. ప్రారంభంలోనే మమతా బెనర్జీ మార్కు పథకాలకు బ్రేక్ ఇస్తూ కొత్త ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోవడం విశేషం.

# బండి సంజయ్ జపం చేస్తున్న బీఆర్ఎస్!

ముఖ్యంగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అదే పనిగా విమర్శలు చేస్తున్నారు. వ్యూహాత్మక దాడికి దిగుతున్నారు. వ్యక్తిగత లేదా కుటుంబ పరమైన పొరపాట్లను రాజకీయంగా వాడుకుని.. ప్రత్యర్థిని నైతికంగా దెబ్బతీయడం ద్వారా తెలంగాణలో బిజెపి ఎదుగుదలకు బ్రేకులు వేయాలనేది కేటీఆర్ వ్యూహంగా కనిపిస్తోంది. బండి సంజయ్ ని పదవి నుంచి తప్పించాలని సాగుతున్న దూకుడు డిమాండ్ వెనుక పెద్ద రాజకీయ లెక్క దాగివున్నట్లు అర్థమవుతోంది..

**గతంలో కొట్టిన దెబ్బతో..**

బండి సంజయ్ అంటేనే గులాబీ పార్టీ వణికి పోతుంది. దానికి కారణం గత ఎన్నికల ఫలితాలే నిదర్శనం. గులాబీ క్యాడర్ ఓటు బ్యాంకును క్రమంగా బిజెపి వైపు మళ్ళించడంలో సంజయ్ పాత్ర ఉంది. బండి సంజయ్ బిజెపి అధ్యక్షుడిగా ఉన్న సమయంలో హిందుత్వ సెంటిమెంట్ రాజకీయాలే ఎందుకు కారణం అన్నది విశ్లేషకుల మాట. దానిని గులాబీ పార్టీ నాయకత్వం కూడా బలంగా నమ్ముతోంది. మళ్లీ బండి సంజయ్ కు పగ్గాలు దక్కితే రాజకీయం పూర్తిగా మారిపోతుంది. బీసీ సెంటిమెంట్ తో పాటు అన్ని కలిసి వస్తాయి. గతంలో బిజెపిని ప్రజాదరణ వైపు నడిపించిన కీలక నేతను గనుక డిఫెన్స్ లో పడేస్తే.. బిజెపి క్యాడర్ ధైర్యం దెబ్బతింటుంది. తద్వారా వివిధ కారణాలతో బిజెపిలోకి వెళ్లిన గులాబీ క్యాడర్ను తిరిగి రప్పించుకోవచ్చు అనేది కెసిఆర్ తో పాటు కేటీఆర్ వ్యూహం.

**వ్యూహాత్మక మైండ్ గేమ్..**

ప్రస్తుతం గులాబీ పార్టీ టార్గెట్ బండి సంజయ్ అన్నట్టు ఉంది. ఆ పార్టీ శ్రేణులతో పాటు సోషల్ మీడియా కూడా ఈ అంశాన్ని విపరీతంగా ట్రోల్ చేస్తోంది. మైండ్ గేమ్ ఆడుతోంది. ఒక బలమైన జాతీయ పార్టీ కేవలం ఒక్క నాయకుడి చుట్టూనే తిరుగుతోందని.. ఆయనను దెబ్బతీస్తే ఇక కోలుకోదు అని గులాబీ పార్టీ పెద్దలు భావిస్తున్నారు. కానీ దానికి ఎంత మాత్రం అవకాశం లేదన్నది విశ్లేషకుల మాట. తెలంగాణలో బిజెపి వ్యక్తిగత చరిష్మ దాటి.. కాస్త ముందడుగులో నిలిచింది. క్షేత్రస్థాయిలో ఆ పార్టీకి క్యాడర్ తో పాటు బలమైన నాయకత్వం పుట్టుకొచ్చింది. అందుకే వ్యక్తిగత వివాదాలు నాయకుడి ప్రతిష్టపై తాత్కాలికంగా ప్రభావం చూపుతాయి కానీ.. సిద్ధాంతాలతో నడిచే పార్టీని నిర్వీర్యం చేయలేవు అనేది విశ్లేషకుల మాట.

# ప్రమాదాల సమయంలో 'గోల్డెన్ అవర్' కీలకం

నిర్వహిస్తున్న విపత్తు నిర్వహణ మాక్ ఎక్సర్‌సైజ్‌లలో భాగంగా, హైదరాబాద్‌లోని నె÷-లకెస్ రోడ్ హెచ్ఎండీఏ గ్రౌండ్స్ వద్ద సోమవారం నిర్వహించిన మాక్ డ్రిల్‌ను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. అనంతరం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో వివిధ శాఖల ఉన్నతాధికారులతో విపత్తు నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... వివిధ రాష్ట్రాలలో అమలు చేస్తున్న అత్యుత్తమ విధానాలకు అనుగుణంగా తెలంగాణలో విపత్తు నిర్వహణ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తామని మంత్రి వెల్లడించారు. ప్రకృతి విపత్తులు, అగ్నిప్రమాదాలను సమర్థవంతంగా ఎదుర్కొవడానికి ప్రపంచవ్యాప్తంగా అందుబాటులో ఉన్న అత్యుత్తమ సాంకేతిక పరిజ్ఞానాన్ని, అత్యాధునిక పరికరాలను పరిశీలించి, వాటి వివరాలతో కూడిన సమగ్ర నివేదికను, ప్రతిపాదనలను వెంటనే సమర్పించాలని అధికారులను ఆదేశించారు. నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ సహకారంతో నిర్వహిస్తున్న ఈ మాక్ డ్రిల్ ద్వారా లభించే అనుభవాలతో అధికారులు విపత్తుల సమయంలో మరింత బాధ్యతాయుతంగా, సమర్థవంతంగా సేవలు అందించాలని సూచించారు. వరదలు, అగ్నిప్రమాదాలు, పారిశ్రామిక ప్రమాదాలు వంటి అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు వేగవంతమైన స్పందన, వివిధ శాఖల మధ్య సమన్వయం, ముందస్తు సన్నద్ధత ఎంతో కీలకమని ఆయన అన్నారు. ÷-రకృతి విపత్తులు సంభవించినప్పుడు మొదటి గంట ఎంతో కీలకమైనదని, దానిని 'గో÷-డలెన్ అవర్'గా పరిగణించాలని పేర్కొన్నారు. ఆ సమయంలో సిబ్బంది అంతా పూర్తి సమన్వయంతో పనిచేస్తూ, అందుబాటులో ఉన్న అత్యాధునిక ఎక్విప్‌మెంట్‌ను సరిగ్గా వినియోగించి ప్రజలకు తక్షణ సేవలు అందించాలన్నారు. అగ్నిప్రమాదాలు, వరదల సమయంలో అన్ని వ్యవస్థలు సకాలంలో స్పందించి ఆస్తి, ప్రాణ నష్టాలను కనిష్ట స్థాయికి తగ్గించేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ముందస్తు అరెస్టులు..



**ఆలేరు మే 23 ప్రభాత సూర్య:** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి యాదగిరిగుట్ట పర్యటన సందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణ కేంద్రంలో అఖిలపక్ష కమిటీ సభ్యులను ముందస్తు అరెస్టు చేసిన స్థానిక పోలీస్ స్టేషన్కు తరలించిన పోలీసులు. ఈ సందర్భంగా అఖిలపక్ష నాయకులు మాట్లాడుతూ ఈ అక్రమ అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నామని, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మంత్రుల పర్యటన సందర్భంగా ఈ ముందస్తు అరెస్టులు దుర్మార్గమైన చర్య అని అన్నారు .అలాగే గత రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బీర్ల ఐలయ్య మేము అధికారుల్లోకి వస్తే 100 రోజుల్లో ఆలేరు రెవెన్యూ డివిజన్ చేస్తామని మేనిఫెస్టోలో ప్రకటించడం జరిగిందని తెలిపారు. ఇదే క్రమంలో రేవంత్ రెడ్డి ,కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఎన్నికల ప్రచార సభలో కూడా ప్రకటించడం జరిగిందని కానీ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాల పూర్తి అయినా ఈరోజు వరకు ఆలేరు రెవెన్యూ డివిజన్ సంబంధించిన అధికార ప్రకటన రాకపోవడం శోచనియమం అని అన్నారు. ఆలేరు రెవెన్యూ డివిజన్ ఏర్పాటుపై ఎమ్మెల్యేకు చిత్తశుద్ధి లేదని ఎమ్మెల్యే వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ఎమ్మెల్యే వెంటనే స్పందించి ముఖ్యమంత్రి తో అధికార ప్రకటన విడుదల చేయాలని కోరారు.లేని పక్షంలో మళ్లీ ఉద్యమ కార్యచరణ ప్రకటించి ఉద్యమాలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష కమిటీ కన్వీనర్ పసుపునూరి వీరేశం, కో కన్వీనర్ రాచకొండ జనార్దన్, చెక్క వెంకటేష్, మోరిగాడి శేఖర్, పుట్ట మల్లేష్ గౌడ్, పద్మ సుదర్శన్, కళ్లెపు అడవయ్యా, నంద గణేష్, జూకంటి పౌల్ తదితరులు పాల్గొన్నారు.

# సీనియర్ సిటిజన్ మండల నూతన కమిటీ ఎన్నిక

## ఎన్నికైన అంబటి చెన్న కిష్టయ్య



**తుర్కపల్లి, మే 23 ప్రభాతసూర్య :** తుర్కపల్లి మండల కేంద్రంలో శనివారం తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్ అసోసియేషన్ మండల నూతన కమిటీని జిల్లా అధ్యక్షుడు ఎర్రగుంట్ల వెంకటేశం ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. మండల నూతన అధ్యక్షునిగా డాక్టర్ అంబటి చెన్న కిష్టయ్య, ఉపాధ్యక్షులుగా సింగిరెడ్డి నరసింహారెడ్డి, నక్క శ్రీశైలం, తునికి మహిరెడ్డి, పిన్నపురెడ్డి నరేందర్ రెడ్డి ప్రధాన కార్యదర్శిగా కొమ్మిరి శెట్టి నరసింహులు సంయుక్త కార్యదర్శిగా పలుగుల దశరథ, ప్రచార కార్యదర్శిగా సిద్ధి రామాచారి, కోశాధికారులుగా పోరెడ్డి మహిపాల్ రెడ్డి, ఆకుల బాలరాజు, సభ్యులుగా గొల్ల కేతమ్మ, కోడూరి ఆంజనేయులు, కసిరబోయిన గోపాల్ ,గడిపే ఇస్తారి, దిరావత్ బిచ్చు, ముఖ్య సలహా అధికారిగా పడాల చంద్రం లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ పిల్లలను కనిపించి ప్రయోజకులుగా ఎదగడానికి సర్వశక్తులు ధారపోసిన తల్లిదండ్రులను జీవిత చరమాంకంలో ఆ పిల్లలు వారిని అవమాన పరుస్తూ, నిత్యం వేధింపులకు గురి చేస్తున్నారని ఇది అత్యంత బాధాకరమైన విషయం అని అన్నారు. వయోవృద్ధులు తమ పిల్లలనుండే కాకుండా సేవకులు ఇరుగుపొరుగు వారి నుండి వేధింపులకు గురవుతున్నారని అన్నారు. ఆస్తుల కోసం వేధింపులకు గురి చేస్తున్నారని పోషణ చేయకుండా గురి చేస్తున్నారని, వైద్య చికిత్సల ఖర్చు పెట్టకుండా వేధింపులకు గురి చేస్తున్నారని ,ఇతర కారణాల వల్ల వేధింపులు గురి చేస్తున్నారని, ఇట్టి నివారణకు వేధింపులకు గురైన వయోవృద్ధులకు సంఘం అనేక విధాలుగా తోడ్పడుతుందని అన్నారు. కుటుంబ సభ్యులు వయోవృద్ధుల పట్ల శ్రద్ధ తీసుకోవాలని, వారి అవసరాలను తీర్చాలని సమాజంలో వయోవృద్ధుల పట్ల గౌరవం అవగాహన పెంచాలని వేధింపులకు గురి అయిన వయోవృద్ధులకు సహాయం చేయడానికి వారిని రక్షించడానికి చర్యలు తీసుకోవాలని, వయోవృద్ధుల వేధింపులకు వ్యతిరేకంగా చట్టాలను ప్రతిష్టంగా అమలు పరచాలని కోరారు. వయోవృద్ధుల సంరక్షణ చట్టం 2007 నిబంధనలు, నేర నివారణ చట్టం 1983 ప్రకారం చర్యలు తీసుకోబడునని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు సాదినేని దశరథ, మండలంలోని వివిధ గ్రామాల సీనియర్ సిటిజన్ సభ్యులు పాల్గొన్నారు



## చికిత్స కోసం ఎల్ఓసి అందజేసిన మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి

**గట్టుపల్ ప్రభాత సూర్య మే23:**గట్టుప్పల మండల కేంద్రనికి చెందిన పగిల్ల కలమ్మ భర్త యాదయ్య నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నేపథ్యంలో మెరుగైన చికిత్స నిమిత్తం సీఎం సహాయనిది నుండి ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి సహకారంతో 2,50000 రెండు లక్షల యాభై వేల రూపాయల ఎల్ఓసి మంజూరు పత్రాన్ని శనివారం ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి నివాసంలో వారి కుటుంబ సభ్యులు పగిల్లా యాదయ్య కు అందజేశారు .వీరి వెంట ఉన్న కాంగ్రెస్ నాయకులు దోర్నాల భరద్వాజ్ నేత మాట్లాడుతూ వెనుకబడిన ప్రజలందరికీ కార్పొరేట్ స్థాయిలో ఉచితంగా సీఎం సహాయ నిధి నుండి వైద్య సదుపాయం అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తోందని అన్నారు ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరినీ ఆదుకునే వ్యక్తి ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి అని కొనియాడారు

## మర్రిగూడ ఎస్సైని కలిసిన తెలుగుదేశం పార్టీ నాయకులు



**మర్రిగూడ మే 23 ప్రభాత సూర్య:** మర్రిగూడ మండల నూతన ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఎస్సై బి. రాంబాబును మర్రిగూడ మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు దోమల వెంకటయ్య యాదవ్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువలతో సన్మానించి స్వీట్లు తినిపించారు. మర్రిగూడ మండల ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మర్రిగూడ మండలంలోని ఎలాంటి సమస్య ఉన్న తన దృష్టికి తీసుకురావాలని కోరారు. అదేవిధంగా శాంతి భద్రత పరిరక్షణ విషయంలో ఎలాంటి రాజి పడకుండా కట్టుదిట్టంగా విధులు నిర్వర్తిస్తానన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించడం తన ప్రధాన లక్ష్యమని ఆయన ఒక ప్రకటనలో తెలియపరిచారు. శాంతి భద్రతల పరిరక్షణలో ప్రతి ఒక్కరు కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మర్రిగూడ మండల తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి పుప్పాల యాదయ్య, మర్రిగూడ మండల తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు పోతే మల్లేష్,మర్రిగూడ మండల గ్రామ శాఖ అధ్యక్షులు గునుగంటి శ్రీరాములు, ఉపాధ్యక్షులు చిన్న, బీసీ సెల్ అధ్యక్షులు కాసర్ల అంజయ్య, ఇందుర్తి గ్రామ శాఖ అధ్యక్షులు వీరమల్ల మల్లేష్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# యుద్ధప్రాతిపదికన ప్రమాదకర చెట్ల కొమ్మల తొలగింపు

## అధికారులకు కృతజ్ఞతలు తెలిపిన కాలనీవాసులు

**నిజాంపేట్, మే 23 (ప్రభాత సూర్య):** నిజాంపేట్ సర్కిల్ ప్రగతి నగర్ జగన్ స్టూడియో పరిసర ప్రాంతంలో గురువారం ఒక చెట్టు కొమ్మ ఒక్కసారిగా రోడ్డుపై విరిగిపడింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తృటిలో తప్పింది. అయితే మరికొన్ని కొమ్మలు విరిగిపడటానికి సిద్ధంగా ఉండటాన్ని గమనించిన స్థానిక కాలనీ నాయకులు బోట్ల తిరుపతి, శరత్ రెడ్డి, వడ్లకొండ సందీప్ లు వెంటనే అప్రమత్తమయ్యారు. వారు ఈ సమస్యను మునిసిపల్, విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.?కాలనీ ప్రతినిధుల ఫిర్యాదుకు అధికారులు తక్షణమే స్పందించారు. జిహెచ్ఎంసి, విద్యుత్ సిబ్బంది ఆధ్వర్యంలో శనివారం ఉదయం నుంచి యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టారు. జగన్ స్టూడియో పరిసరాలతో పాటు ఎన్ఆర్ఐ కాలనీలోని ఝాన్సీ లక్ష్మీబాయి పార్కులో ప్రమాదకరంగా ఉన్న భారీ వృక్షాల కొమ్మలను, కరెంట్ వైర్లకు అడ్డుగా ఉన్న భాగాలను కత్తిరించి తొలగించారు. ప్రజల భద్రతకు పెద్దపీట వేసి వేగంగా స్పందించినందుకు అధికారులకు, క్షేత్రస్థాయి సిబ్బందికి ఎన్ఆర్ఐ కాలనీవాసులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.






## సెంట్రింగ్ కార్మికుల డిమాండ్ల సాధన కై సమ్మె ఉధృతి ..

### మరో వారం కొనసాగింపు నిర్ణయం..

**శేరిలింగంపల్లి ప్రభాత సూర్య:** శేరిలింగంపల్లి నియోజక వర్గం కొండాపూర్ సెంట్రింగ్ యూనియన్ ఆధ్వర్యంలో చైర్మన్ విశ్వనాథ్ యాదవ్, ప్రెసిడెంట్ రాము యాదవ్, జనరల్ సెక్రటరీ సామ ఎల్లారెడ్డి, వైస్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి నాయకత్వంలో సెంట్రింగ్ కార్మికులు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం చేపట్టిన సమ్మె ఉధృతంగా కొనసాగుతోంది. సెంట్రింగ్ రేటును రూ.51 పెంచాలని, కార్మికులకు ఈఎస్ఐ కార్డుల సౌకర్యం కల్పించాలని , ప్రతి నిర్మాణ స్థలంలో సెంట్రింగ్ మెటీరియల్ దొంగతనాలను అరికట్టాలని వారు డిమాండ్ చేశారు. మే 16 నుంచి ప్రారంభమైన ఈ సమ్మె 8వ రోజుకు చేరుకోగా, శనివారం కొండాపూర్ యూనియన్ తరఫున సుమారు 200 మంది కాంట్రాక్టర్లు టూ-వీలర్ ర్యాలీ నిర్వహించారు. కొండాపూర్ నుంచి ధర్నా చౌక్ వరకు భారీ ర్యాలీ చేపట్టి, అనంతరం ఇందిరా పార్క్ వద్ద కి చేరి దర్నాలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా యూనియన్ జనరల్ సెక్రటరీ సామ ఎల్లారెడ్డి మాట్లాడుతూ, "మా న్యాయమైన డిమాండ్లు నెరవేరే వరకు సమ్మెను విరమించే ప్రసక్తే లేదు" అని స్పష్టం చేశారు.అలాగే, సమ్మెను మరో వారం రోజుల పాటు కొనసాగించాలని ఈ రోజు సమావేశంలో తీర్మానించినట్లు నాయకులు తెలిపారు.

## జన గణనకు అందరూ సహకరించాలి జోనల్ కమిషనర్ నారాయన్ అమిత్... ఐఏఎస్



**శేరిలింగంపల్లి ప్రభాత సూర్య :** సెంట్రల్ సెన్సస్ బృందంతో పాటు జోనల్ కమిషనర్, శేరిలింగంపల్లి జోన్ మరియు డిప్యూటీ కమిషనర్, శేరిలింగంపల్లి, కలిసి ఖాజాగూడలోని జైన్స్ కార్టన్ క్రీక్ అపార్ట్మెంట్ను సందర్శించారు. జరుగుతున్న జనగణన కార్యకలాపాలను సమీక్షించి, క్షేత్రస్థాయి ఎన్యూమరేషన్ ప్రక్రియను పరిశీలించారు. జనగణన విజయవంతంగా అమలు కావడానికి ఖచ్చితమైన, పారదర్శకమైన, సమగ్రమైన డేటా సేకరణ ఆవశ్యకతను ఈ సందర్భంగా అధికారులు నొక్కి చెప్పారు. ఇంటింటి సర్వేలో పాల్గొంటున్న సిబ్బందితో మాట్లాడి, ఎదురవుతున్న సవాళ్లను అడిగి తెలుసుకున్నారు. ప్రజలందరూ జనగణన ప్రక్రియలో సహకరించి, సరైన సమాచారం అందించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

## రైతు పండించిన ప్రతి గింజా కొనుగోలు చేస్తాం:

### ఐకేపీ సెంటర్ల తనిఖీలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



**ప్రభాత సూర్య మాడుగుల పల్లి (మే 23)ప్రతినిధి :** మిర్యాలగూడ నియోజకవర్గం మాడ్గులపల్లి మండలం లోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఐకేపీ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అధికారులతో కలిసి శనివారం ఆకస్మికంగా సందర్శించారు... ఈ సందర్భంగా కేంద్రాల్లో అందుబాటులో ఉన్న వసతులు, ధాన్యం కొనుగోలు ప్రక్రియ తూకాలను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకొచ్చిన స్థానిక రైతులతో నేరుగా మాట్లాడి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ. ప్రజా ప్రభుత్వం ఎల్లప్పుడూ రైతుల పక్షపాతేనని, నియోజకవర్గంలోని రైతులు పండించిన ప్రతి గింజనూ మద్దతు ధరతో కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు... ఐకేపీ సెంటర్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని రకాల చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.ఎవరైనా సరే, 'కటింగ్' (తరుగు) పేరుతో రైతులను ఇబ్బంది పెడితే సహించేది లేదని హెచ్చరించారు. నిబంధనల ప్రకారం నిర్ణీత తేమ శాతం ఉన్న ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని స్పష్టం చేశారు. తూకాల విషయంలో ఎలాంటి అవకతవకలు జరగకుండా అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో , ఐకేపీ ఏపీఎం , ఐకేపీ సీసీలు, వీఓఏలు, వ్యవసాయ శాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు రైతులు పాల్గొన్నారు.



## కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే బిఎల్ఆర్

**మిర్యాలగూడ మే 23:- (ప్రభాత సూర్య):** మిర్యాలగూడ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో స్థానిక శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్ మిర్యాలగూడ మండల పరిధిలోనీ గ్రామాల సుమారు 20 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను చెక్కులను శనివారం పంపిణి చేశారు. కార్యక్రమంలో ఆర్డిఓ ఎస్. రమణారెడ్డి, తహసీల్దార్ పి. శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు గాయం ఉపేందర్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తలకొప్పుల సైదులు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కె. బసవ-య్యాగౌడ్, కాంగ్రెస్ నాయకులు ఆవుల పీతంబర్ రెడ్డి, కట్టేబోయిన రాంలింగయ్య యాదవ్, జె. లింగయ్య, సర్పంచులు కాంగ్రెస్ పార్టీ నాయకులు.

## సమస్యలు పరిష్కరించాలని వివోఏల రెండో రోజు ధర్నా



**మిర్యాలగూడ , మే 23:- (ప్రభాత సూర్య):** ఐకెపి వివోఏల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక మండల పరిషత్ ఆవరణలో రెండో రోజు శునివారం వివోఏ జెఏసి పిలుపు మేరకు ధర్నా చేశారు. అధ్యక్ష కార్యదర్శులు కప్పల లక్ష్మి, బంటు చంద్రకళలు మాట్లాడుతూ కనీస వేతనం రూ. 20,000లు ఇవ్వాలని, సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి, హెచ్ఆర్ పాలసీ వర్తింప చేయాలని, విఓఎలకు సీసీలుగా పదోన్నతి కల్పించాలని, సాధారణ ఆరోగ్య భీమా రూ.20లక్షలు కల్పించాలని, ట్యాబ్ సౌకర్యం కల్పించాలని, జిఓ నెంబర్ 58 సవరించాలని కోరారు. తమ సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. లేకుంటే సమ్మెలోకి వెళ్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం కోశాధికారి జానీ, లక్ష్మీపార్వతీ, విజయలక్ష్మి సావిత్రి, సుహాసిని, మంగమ్మ,, రజినిలు పాల్గొన్నారు.

## ఆర్టీసీ ఉద్యోగులును ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తు జూన్ 2న అపాయింట్మెంట్ డేట్ ప్రభుత్వం ప్రకటించాలి

### టీఆర్టీసి వర్కర్స్ యూనియన్ నేతలు రామావతారం, వెంకటేశ్వర్లు





మిర్యాలగూడ , మే 23:- (ప్రభాత సూర్య) టీజిఎస్ఆర్టీసిని ప్రభుత్వంలో వెంటనే విలీనం చేయాలని ఆర్టీసీ ఉద్యోగులును ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని జూన్ 2న అపాయింట్మెంట్ డేట్ ప్రభుత్వం ప్రకటించాలని తెలంగాణ ఆర్టీసి వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు పి. రామావతారం, ఐ. వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో కోరారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయుటకు కావలసిన అన్ని అవకాశాలను తీసుకుని గవర్నర్ ఆమోద ముద్ర కూడా తీసుకున్నరన్నారు.వెంటనే ఎన్నికల రావటం వెళ్లిన ప్రక్రియ ఎన్నికల కోడ్ వల్ల ఆగిపోయినదన్నారు. ఆర్టీసీ ఉద్యోగులు అనేక దశాబ్దాలు ఎదురుచూస్తున్న ప్రభుత్వంలో విలీనం అంశాన్ని వెంటనే పరిష్కరించాలని విధివిధానాలు అన్నీ కూడా ఆంధ్రప్రదేశ్ నుండి ఆన్లైన్లో తెప్పించుకొని పరిశీలించి అంత కన్నా మెరుగైన జాబ్ సెక్యూరిటీ ఉండే విధంగా వేధింపులు లేకుండా గౌరవప్రదంగా ఉద్యోగం నిర్వహించుకునే విధంగా ఉండాలని అవసరమైతే అన్ని యూనియన్ల నాయకులను తీసుకుని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పర్యటించి అన్ని విషయాలు పరిగణలోకి తీసుకొని ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనం చేయాలని రామావతారం, వెంకటేశ్వర్లు కోరారు.

# గ్రామ గ్రామాన తెలంగాణ రక్షణ సేన జండా ఆవిష్కరణ కార్యక్రమాలు

**సామాజిక తెలంగాణ సాధనకు ఉద్భవించిన పార్టీ టీఆర్ఎస్ (తెలంగాణ రక్షణ సేన) ● నెల రోజుల పాటు జెండా ఆవిష్కరణలు**

**ప్రభాత సూర్య నర్సాపూర్ మే 23 :** తెలంగాణ రాష్ట్రంలో ప్రజల అభ్యున్నతను , సామాజిక తెలంగాణ సాధన లక్ష్యంగా రాష్ట్రంలో తెలంగాణ రక్షణ సేన పార్టీనీ కల్వకుంట్ల కవిత స్థాపించారు ఈ సందర్భంగా మే 20 నుండి జూన్ 20 వరకు నెల రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా జెండా పండుగ కార్యక్రమాలలో భాగంగా నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జ్ మన్నే గణేష్ కుమార్ ఆధ్వర్యంలో శనివారం మున్సిపల్ కమిషనర్ కు జెండా గద్దె అనుమతి ఆవిష్కరణ కొరకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ పాలన పట్ల ప్రజలు అసంతృప్తిగా ఉన్నారని సామాజిక తెలంగాణ సాధించడంలో ప్రభుత్వాలు విఫలం చెందాయని మౌలిక రాష్ట్రంలో ప్రజలకు సదుపాయాలను కల్పించలేని ఈ ప్రభుత్వాల పట్ల ప్రజలు అసంతృప్తిగా ఉన్నారని, మార్పు కోరుకుంటున్నారని రాష్ట్రంలో ఉచిత విద్య, ఉచిత వైద్యం సామాజిక తెలంగాణ, రైతు సంక్షేమం, యువతకు ఉద్యోగాల కల్పన లక్ష్యంగా మరో శక్తి ఉద్భవించిన పార్టీ తెలంగాణ రక్షణ సేన పార్టీ (టీఆర్ఎస్) అని అన్నారు. కవిత ఒక ప్రణాళిక బద్ధంగా ముందుకు వెళుతుందని ఈ పార్టీలో చేరుటకు యువత మహిళలు పార్టీలో చేరుటకు ఆసక్తిగా ఉన్నారని యువత రాజకీయ నాయకులుగా ఎదుగుదలకు మంచి అవకాశం ఉందని నర్సాపూర్ నియోజకవర్గంలో కవిత ఆశయాలను, సిద్ధాంతాలను ప్రతి గ్రామానికి తీసుకువెళ్తామని ఈ జెండా పండుగ సందర్భంగా గ్రామ స్థాయిలో పార్టీని బలోపేతం చేస్తామని తెలంగాణ రాష్ట్రంలో తొలి మహిళా ముఖ్యమంత్రిగా చరిత్రలో కవిత నిలిచిపోతుందని ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో అపర్ణ , రామచంద్ర రెడ్డి తిరుపతి రెడ్డి చంద్ర పవన్ రెడ్డి ప్రవీణ్ యాదవ్, నవీన్ రాము ముదిరాజ్ పాల్గొన్నారు



# రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసిన ఆవుల రాజిరెడ్డి





**ప్రభాత సూర్య నర్సాపూర్ మే23:** సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం లోని గుండ్ల మాచునూర్ పారిశ్రామిక వాడలో శని వారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకట్ స్వామి ల చిత్ర పటాలకు కార్మికులతో కలసి నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆవుల రాజిరెడ్డి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆవుల రాజిరెడ్డి మాట్లాడుతూ దేశంలో బి జె పి ప్రభుత్వం ఉండి కార్మికుల కనిసవేతనాలు అమలుచేయడంలో విఫలమైందన్నారు.గత పది సంవత్సరాలుగా ఈ రాష్ట్రంలో కార్మికులకు కనీస వేతనాలు అమలుచేయలేదన్నారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన రెండున్నర సంవత్సరాల లో కార్మికులను ,వారి కష్టాలను దృష్టిలో పెట్టుకొని వారి సంక్షేమం కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కార్మికులకు కనీస వేతనాలు అమలు చేశారని ఆయన అన్నారు. ఈ సందర్భంగా హర్షం వ్యక్తం చేస్తూ రేవంత్ రెడ్డి,మంత్రి వివేక్ వెంకట్ స్వామి ల చిత్ర పటాలకు పాలాభిషేకం నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గుండ్ల మాచునూర్ సర్పంచ్ శ్రీహరి,మండల పార్టీ అధ్యక్షుడు కృష్ణ,సర్పంచ్ యాదగిరి,లింగాపూర్ సర్పంచ్ మణి దీప్,గోవింద్ రాజ్ పల్లి సర్పంచ్ బండమీది రాజు,కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఆస్తి వివాదం ముదుర్చిన కుటుంబ కలహాలు.. కాట శ్రీనివాస్ గౌడ్‌పై తీవ్ర ఆరోపణలు

**రాజేష్ గౌడ్‌పై దాడి జరిగిందని ఫిర్యాదు.. డీఎన్ఏ పరీక్షకు సిద్ధమని సునీత గౌడ్ ప్రకటన**

**అమీన్ పూర్, మే 23,(నినాదం ):** సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారిన కాట కుటుంబ వివాదం తాజాగా మరింత తీవ్రరూపం దాల్చింది. పటాన్‌చెరు కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జి కాట శ్రీనివాస్ గౌడ్‌పై ఆయన వదిన కాట సునీత గౌడ్ తీవ్ర ఆరోపణలు చేశారు. ఆస్తి పంపకాల విషయంలో మాట్లాడదామని పిలిచి, తన భర్త కాట రాజేష్ గౌడ్‌పై దాడికి పాల్పడ్డారని ఆరోపిస్తూ రామచంద్రాపురం ఏసీపీ శ్రీనివాస్ కుమార్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన సునీత గౌడ్, కుటుంబ ఆస్తుల విషయంలో గత కొంతకాలంగా వివాదాలు కొనసాగుతున్నాయని తెలిపారు. సమస్యను సామరస్యంగా పరిష్కరించుకుందామని చెప్పి పిలిచిన అనంతరం రాజేష్ గౌడ్‌పై దాడి జరిగిందని పేర్కొన్నారు. ఈ ఘటనతో తమ కుటుంబ సభ్యులు భయాందోళనలకు గురయ్యారని, తమ ప్రాణాలకు ముప్పు ఉందని ఆరోపించారు. కుటుంబానికి రక్షణ కల్పించాలని పోలీసులను కోరినట్లు వెల్లడించారు. అదేవిధంగా కుటుంబ వ్యవహారానికి సంబంధించిన మరో అంశంపై కూడా సునీత గౌడ్ స్పందించారు. కాట దర్శన్ గౌడ్‌కు రాజేష్ గౌడ్ తండ్రి కాదంటూ వస్తున్న వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. అలాంటి ఆరోపణలు చేయడం అవాస్తవమేకాక కుటుంబ గౌరవాన్ని దెబ్బతీసే చర్య అని




మండిపడ్డారు. నిజానిజాలు బయటపడాలంటే డీఎన్ఏ పరీక్ష నిర్వహించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. ఇక ఈ వివాదానికి సంబంధించి కాట శ్రీనివాస్ గౌడ్‌కు సునీత గౌడ్ బహిరంగ సవాల్ విసిరారు. నిజం తమవైపే ఉంటే కట్ట మైసమ్మ దేవాలయానికి పసుపు బట్టలతో వచ్చి ప్రమాణం చేయాలని ఆమె డిమాండ్ చేశారు. కుటుంబ పరువు తీసేలా ఆరోపణలు చేయడం బాధాకరమని, అన్ని



విషయాలు ప్రజల ముందుకు తీసుకురావాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వ్యవహారం ప్రస్తుతం పటాన్‌చెరు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీస్తోంది. కుటుంబ వివాదం రాజకీయ రంగు పులుముకుంటుందా అనే అంశంపై స్థానికంగా ఆసక్తికర చర్చ కొనసాగుతోంది. మరోవైపు ఈ ఆరోపణలపై కాట శ్రీనివాస్ గౌడ్ వర్గం ఎలా స్పందిస్తుందన్నది ఉత్కంఠగా మారింది.

# మూడు కోట్ల 66 లక్షల లక్షల రూపాయల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

**అమీన్పూర్, మే 23,ప్రభాత సూర్య :** పటాన్చెరు నియోజకవర్గం అమీన్పూర్ డివిజన్, బీరంగూడ డివిజన్ల పరిధిలోని వివిధ కాలనీలు, విలీన గ్రామాలలో 3 కోట్ల 66 లక్షల రూపాయలతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసిన పటాన్చెరు సభ్యులు శ్రీ గూడెం మహిపాల్ రెడ్డి గారు. శర వేగంగా అభివృద్ధి చెందుతున్న బీరంగూడ, అమీన్పూర్ డివిజన్ల పరిధిలోని ప్రతి కాలనీలో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని ఆయన తెలిపారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకుల ద్వారా ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి ప్రణాళికాబద్ధంగా నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. హాజరైన మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జెడ్పిటిసి సుధాకర్ రెడ్డి, మున్సిపల్ మాజీ ఛైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నరసింహా గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ సత్యనారాయణ, మాజీ ప్రజా ప్రతినిధులు, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, ప్రజలు.




# యలమంచి ఉదయ్ కిరణ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఫ్రీ మెగా మెడికల్ క్యాంపు..

## మమతా అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్సెస్ హాస్పిటల్, బిగ్ టీవీ సహకారంతో నిర్వహణ..



**శేరిలింగంపల్లి ప్రభాత సూర్య:** మియాపూర్ డివిజన్ పరిధిలోని బీకేఎంక్లేవ్ కమ్యూనిటీ హాల్ ,బీకే ఎంక్లేవ్ కాలనీ నందు మమతా అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్సెస్ హాస్పిటల్ సౌజన్యంతో ఉచిత మెగా మెడికల్ క్యాంపును నిర్వహించారు. ఈ మెడికల్ క్యాంపుకు ముఖ్య అతిథులుగా వి.జగదీశ్వర్ గౌడ్ శేరిలింగంపల్లి అసెంబ్లీ కాంగ్రెస్ ఇంచార్జ్, టిపి సి సి జనరల్ సెక్రటరీ,మారబోయిన రఘునాథ్ యాదవ్ తెలంగాణ రాష్ట్ర యాదవ సంఘం కార్పొరేషన్ చైర్మన్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..యలమంచి ఉదయ్ కిరణ్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు గా మియాపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రెటరీ గా సేవలందిస్తూ సామాజిక సేవ పట్ల నిబద్ధతతో, ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావాలనే సంకల్పంతో పనిచేస్తు ప్రజల మన్ననలు అందుకుంటున్న మియాపూర్ కి చెందిన యువ నాయకుడు యలమంచి ఉదయ్ కిరణ్ ,అనేక ప్రతిష్టాత్మక జాతీయ గౌరవాలను అందుకుని తెలంగాణకు, మియాపూర్ ప్రాంతంకు గర్వకారణంగా నిలిచారు. సేవా ప్రస్థానంలో అనేక సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టి ప్రజల మన్ననలు పొందారు అని తెలిపారు. సమ్మర్ కూలింగ్ స్టేషన్లు ప్రతీ వేసవిలో విశ్రాంతి కేంద్రాలు, అనుబంధ గ్రామాలలో ఉచిత వైద్య శిబిరాలు -- వెనుకబడిన ప్రాంతాలకు వైద్య సేవలుయలమంచి ఉదయ్ కిరణ్ ఛారిటబుల్ ట్రస్ట్ సేవా కార్యక్రమాలు ప్రజల హృదయాలను తాకుతూ, మియాపూర్ నుంచి రాష్ట్రవ్యాప్తంగా ప్రజల మద్దతును పొందుతున్నాయి. అటు రాజకీయ రంగంలో కూడా అందరూ మన్ననలు పొందుతూ అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు. గొప్ప పరిణామం అని,ఇంతటి గొప్ప కార్యక్రమం చేపట్టడం చాలా ఆనందంగా ఉందని నిర్వాహకులను అభినందించారు. యలమంచి ఉదయ్ కిరణ్ తన టీం సభ్యులు వారి సేవలను ఇంకా విస్తృత పరిచి మంచి పేరు తెచ్చుకోవాలి అని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ.. ఎంతో మంది వ్యాధిని గుర్తించలేక వైద్యానికి దూరమవుతూ అనేక రోగాల బారిన పడుతున్నారని,రోగికి వచ్చిన వ్యాధిని గుర్తించలేక హాస్పిటల్‌కి వెళ్లే స్థోమత లేక దుర్భరమైన జీవితం గడుపుతూ ప్రాణాలను పోగొట్టుకుంటున్నారని అలాంటి వారి కోసం యలమంచి ఉదయ్ కిరణ్ చారిటబుల్ ట్రస్ట్ ముందుకు వచ్చి ఇంతటి గొప్ప కార్యక్రమాన్ని నిర్వహించడం చాలా గొప్ప విషయం అని,నిర్వాహకుల ను,వైద్యులను అభినందించారు..అనంతరం యలమంచి ఉదయ్ కిరణ్ మాట్లాడుతూ మియాపూర్ డివిజన్ లో వివిధ రకములైన సేవా కార్యక్రమాలకి నాకు సహకరించి ప్రోత్సహిస్తున్న ముఖ్య అతిథులుగా విచ్చేసిన వారికి మా టీం తరుపున వారికి హృదయ పూర్వక కృతజ్ఞతలు అని ఈ సందర్భంగా తెలిపారు. అలాగే "ఈ మెగా మెడికల్ క్యాంప్ ద్వారా అనేక మంది కి అవసరమైన వైద్య సహాయం అందించడంలో మా ప్రయత్నం విజయం సాధించింది. మియాపూర్ డివిజన్‌లోని ప్రజల సంక్షేమం కోసం సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తాము" అని తెలిపారు. అలాగే, మమతా అకాడమీ ఆఫ్ మెడికల్ హాస్పిటల్, యాజమాన్యానికి ఉచిత రవాణా మరియు ఉచిత వైద్య సేవలు అందిస్తున్నందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే, ప్రజల ఆరోగ్యమేలుకు, మెరుగైన ఆరోగ్య పరిష్కారాలను అందించేందుకు చేసిన గొప్ప ప్రోత్సాహక చర్యలకు సహకారం అందిస్తున్న బిగ్ టీవీ మేనేజ్మెంట్ కూడా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా బీకే ఎంక్లేవ్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియచేసారు.సుమారుగా 300 లమంది పైగ వివిధ ఆరోగ్య పరీక్షలు ఈ క్యాంపులో చేయించుకున్నారు.ఈ కార్యక్రమంలో వైభవ్,రావిపాటి వెంకటేశ్వర్లు (అధ్యక్షులు), ధనుంజయ (జనరల్ సెక్రటరీ), విజయ భాస్కర్,నరేందర్ రెడ్డి,ప్రతాప్ రెడ్డి,పద్మ ,సాయి కృష్ణ,మోహన్ రెడ్డి,ఎంసీ రెడ్డి,కృష్ణ,షా , కేవీరావు,మన్నేపల్లి సాంబశివరావు, అట్టేపల్లి రాంప్రభు, రవీందర్ రెడ్డి,మిర్యాల ప్రీతం,కుమార్, రాంచందర్, రవి,శ్రీనివాస్ ముదిరాజ్,సత్య రెడ్డి,కృష్ణ గౌడ్,శేఖర్ ముదిరాజ్,సింధూర,నవ్యశ్రీ,భాగ్య లక్ష్మి,శ్రీ దేవి,జయ,నాజియా,విజయ ,వెంకటేశ్వర్లు ,బాబ్జీ, గోపాలకృష్ణ, ఎస్సీఆర్సీమూర్తి, శ్రీనివాసులు, సత్యనారాయణ,రాజేష్ ,మనీ,కార్తీక్,దినేష్ గౌడ్,గిరి, మహేందర్,లక్ష్మణ్ రావు, ,నరేందర్, శ్రీనివాస్,చక్రపాణి,రాజేశ్వరి,సిహెచ్ సాంబయ్య , బాల మురళి,నవీన్,సాయి కృష్ణ, సాధన, సత్య రెడ్డి, తాండ్ర రామచంద్ర గౌడ్, వెంకటేష్, శివ ముదిరాజ్ ప్రవీణ్, నాగ సాయి, నరేష్, వినోద్, వంశీ చౌదరి, వాసు కామినేని, సాయి నిఖిల్, రత్న చారి, నాగ సాయి బొబ్బ, మధు, శరత్, రాధా కృష్ణ, శివ ప్రసాద్, సర్దార్, నరేష్, కర్రి నాని,అశోక్ , నరేష్, దినేష్ గౌడ్, కార్తీక్,శ్రీను , రవి, వెంకటేష్, నరేష్, ఇరాన్ జగన్ రామస్వామి, కిరణ్, బండి రామకృష్ణ, సురేష్, నరేష్, సంజయ్, ధన్రాజ్, ప్రశాంత్, సల్మాన్, ఆసిఫ్, కరీం, మణిక్, శేఖర్, ప్రసాద్, రఘు, సత్యనారాయణ, వలభనేని నరసింహారావు, ప్రకాష్, సత్య, శేషగిరిరావు, అనేకమంది ప్రముఖులు పాల్గొన్నారు.





# పేదల ఆకలి తీర్చేందుకే అన్నదానం చేస్తున్నాం...

## హోప్ ఫౌండేషన్ అధ్యక్షులు కొండ విజయ్ కుమార్....

**చందానగర్ ప్రభాత సూర్య :** ఆకలితో అలమటిస్తున్న బడుగు బలహీన వర్గాలకు పాదచారులకు, చందానగర్ గంగారం లోని వివిధ షోరూం పని చేస్తున్న ప్రజలకు ప్రతి శనివారం సుమారు 3000 మంది కి అన్నదానం నిర్వహించడం హర్షణీయమని స్థానిక ప్రజలు అన్నారు. హోప్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అన్నదాన కార్యక్రమంలో హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండ విజయ్ కుమార్ లేకున్నా నియమ నిబంధనలు పాటిస్తూ అన్నదాన కార్యక్రమం నిర్వహించడం పట్ల నిర్వాహకులను స్థానిక ప్రజలు అభినందించారు. ఈ కార్యక్రమంలో అన్నె సందీప్, గాలి కృష్ణ, రవి కుమార్, భాస్కర్, మధు సుధన్ రెడ్డి, మల్లేష్, విష్ణు మూర్తి, రవి, పీటర్, మారం ప్రసాద్, శంకర్, షర్ఫుద్దీన్, కిరణ్, విజయ్, సంతోష్, ప్రకాష్, దత్తు, సురేష్, నక్క శ్రీను, హోప్ ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# అట్టేపల్లి రామప్రభు ఆధ్వర్యంలో నాలుగో శనివారం అన్నదాన కార్యక్రమం..



**శేరిలింగంపల్లి ప్రభాత సూర్య :** అట్టేపల్లి లక్ష్మీనారాయణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ అట్టేపల్లి రామప్రభు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వారాంత అన్నదాన కార్యక్రమంలో భాగంగా 4వ శనివారం అన్నదాన కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా అవసరమైన వారికి ప్రేమతో, సేవాభావంతో అన్నదానం అందజేయడం జరిగింది. కార్యక్రమంలో ఏ ఆర్ పి టీమ్ సభ్యులు, ట్రస్ట్ ప్రతినిధులు మరియు స్థానిక ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. అట్టేపల్లి రామప్రభు మాట్లాడుతూ, సమాజ సేవలో భాగంగా భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ట్రస్ట్ తరఫున కృతజ్ఞతలు తెలియజేశారు.


# గృహగణనలో ప్రజలు సరైన సమాచారం ఎన్యుమారేటర్లకు ఇవ్వాలి : మునిసిపల్ కమిషనర్ శ్రీనివాస్

**మిర్యాలగూడ మే 23:-( ప్రభాత సూర్య):**జనాభా గణనలో భాగంగా గృహగణనలో మిర్యాలగూడ పట్టణ ప్రజలు సరైన సమాచారాన్ని గణాంకాల కోసం వచ్చే ఉపాధ్యాయ ఎన్యుమారేటర్లకుఅందించాలని మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాస్ కోరారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కార్యాలయ వివరాలు సేకరించేందుకు వచ్చిన అధికారులు, పలు వివరాలను కమిషనర్ ను అడిగి తెలుసుకున్నారు. ప్రజలిచ్చే గణాంకాలకు అనుగుణంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భవిష్యత్తులో నిధుల మంజూరు సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకుంటుందని ప్రజలు నిక్కచ్చిగా సమాచారాన్ని అందించాలని కోరారు. టిపిఎస్ కె.అంజయ్య, జెఏ శంకర్ సూపర్వైజర్లు, పాల్గొన్నారు



# రైతు పండించిన ప్రతి గింజా కొనుగోలు చేస్తాం

## ఐకేపీ సెంటర్ల తనిఖీలో ఎమ్మెల్యే బిఎల్ఆర్



**మిర్యాలగూడ ,మే 23:-( ప్రభాత సూర్య):** మిర్యాలగూడ నియోజకవర్గ మాడ్గులపల్లి మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఐకేపీ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్ అధికారులతో కలిసి శనివారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రాల్లో అందుబాటులో ఉన్న వసతులు, ధాన్యం కొనుగోలు ప్రక్రియ, తూకాలను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకొచ్చిన స్థానిక రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బిఎల్ఆర్ మాట్లాడుతూప్రజా ప్రభుత్వం ఎల్లప్పుడూ రైతుల పక్షపాతేనని, నియోజకవర్గంలోని రైతులు పండించిన ప్రతి గింజనూ మద్దతు ధరతో కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు. ఐకేపీ సెంటర్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని రకాల చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఎవరైనా సరే, తరుగు పేరుతో కటింగ్ చేసి రైతులను ఇబ్బంది పెడితే సహించేది లేదని హెచ్చరించారు. నిబంధనల ప్రకారం నిర్ణీత తేమ శాతం ఉన్న ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని స్పష్టం చేశారు. తూకాల విషయంలో ఎలాంటి అవకతవకలు జరగకుండా అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో ఆర్డిఓ ఎస్. రమణారెడ్డి, తహసీల్దార్ ఎస్. సరోజ పావని, ఐకేపీ ఏపీఎం, ఐకేపీ సీసీలు, వీఓఏలు, వ్యవసాయ శాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, రైతులు పాల్గొన్నారు.



# గుంతల రోడ్డుకు మరమ్మతు చేయాలని పాదయాత్ర

## ఆరు కిలోమీటర్ల పాదయాత్రలో రంగారెడ్డి





**మిర్యాలగూడ మే 23:- (ప్రభాత సూర్య) :** నడవడానికి కూడా వీలు లేకుండా పూర్తిగా గుంతల మయమైన రోడ్డును తక్షణమే మరమ్మతు చేయాలని ఆరు నెలలో పూర్తి చేయకపోతే ప్రత్యక్ష కార్యాచరణ చేపడతామని మాజీ ఎమ్మెల్యే, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి హెచ్చరించారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం నార్కెట్పల్లి -అద్దంకి హైవే నుండి బోట్యానాయక్ తండ వరకు గల రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారిందని సిపిఎం ఆధ్వర్యంలో పాదయాత్ర బోట్యానాయక్ తండా నుండి ఆయన ప్రారంభించారు. గూడూరు గ్రామం ఈదులగూడ, హౌసింగ్ బోర్డ్ కాలనీ నుండి రెవిన్యూ డివిజన్ కార్యాలయం చేరుకుని కార్యాలయ ఎఓ శ్రీనివాసశర్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రంగారెడ్డి మాట్లాడుతూ తండావాసులు నిత్యం వారి అవసరాల కొరకు పట్టణానికి వస్తుంటారని రోడ్డు పూర్తిగా గుంతల మయమైనందువల్ల రాకపోకలకు గిరిజనులు ఇబ్బంది పడుతున్నారని వాపోయారు. రోడ్డు నిర్మాణం కొరకు టెండర్లు ఖరారు అయినప్పటికీ సదరు కాంట్రాక్టర్ పనులు ప్రారంభించకపోవడం బాధాకరమన్నారు. అత్యంత ప్రాధాన్యత కలిగిన రోడ్డును మరమ్మత్తు చేయకపోవడం విశారకరమన్నారు. మరమ్మతు పనులు వచ్చే నెల10 వరకు పూర్తి చేయకపోతే ఆర్టీఓ కార్యాలయం ముందు నిరవధిక సమ్మెకు పూనుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు మల్లేష్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వెంకటేశ్వర్లు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు రాగిరెడ్డి మంగారెడ్డి, ఎం.రవినాయక్ పరుశురాములు పట్టణ కార్యదర్శి మల్లు గౌతంరెడ్డి, టాప్రా నాయకులు నూకల జగదీష్ చంద్ర, గ్రామ సర్పంచ్ సాగర్ నాయక్, ఉపసర్పంచ్ శ్రీను గూడూరు గ్రామ సర్పంచ్ కృష్ణయ్య, సిపిఎం నాయకులు పిల్లుట్ల సైదులు, బొంగరాల వెంకటయ్య, మేక రాంబాబు, మహిళా సమాఖ్య నాయకులు మంగా, కరీమున్నీసాబేగం పాల్గొన్నారు.

# కౌమార బాలికల హెల్త్ క్యాంప్

**మిర్యాలగూడ, మే 23:- (ప్రభాత సూర్య) :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ లో భాగంగా మిర్యాలగూడ పట్టణం బంగారుగడ్డ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో శనివారం కౌమార బాలికల హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఈ ప్రోగ్రామ్ కి ముఖ్య అతిథులుగా మిర్యాలగూడ మున్సిపల్ చైర్మన్ చిలుకూరి సుధా, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ జానకిరాములు, డాక్టర్ సాయికాంత్, మెప్మా సిఓ జి. వెంకటేశ్వర్లు, కేంద్రం సిబ్బంది సోములమ్మ, సుజాల, దేవి, నాగమ్మ, రజిత, జ్యోతిలు పాల్గొన్నారు. క్యాంపులో కౌమార బాలికలకు వైద్య పరీక్షలు, రక్తహీనత పరీక్షలు చేసి మందులు ఇచ్చారు.






## పటాన్‌చెరు, జేపీ కాలనీ పరిధిలో మౌలిక వసతుల పనులు వేగవంతం చేయాలని అధికారులతో సమీక్ష

**పటాన్చెరు, మే 23,ప్రభాత సూర్య :** పటాన్‌చెరు మరియు జేపీ కాలనీ డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో అత్యవసర మౌలిక వసతుల కల్పనకు నిధుల మంజూరు చేసి అభివృద్ధి పనులను తక్షణమే ప్రారంభించాలని కోరుతూ మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో జీహెచ్ఎంసీ కార్యనిర్వాహక ఇంజినీర్ సురేష్ కుమార్, పనుల పరిశీలకుడు మహేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మెట్టు కుమార్ యాదవ్ మాట్లాడుతూ పటాన్‌చెరు, జేపీ కాలనీ డివిజన్ పరిధిలోని శాంతినగర్, శ్రీనగర్ కాలనీల్లో రూ.38 లక్షల అంచనా వ్యయంతో నూతన సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టాల్సి ఉందన్నారు. అలాగే గోకుల్ నగర్ సరాయి మసీదు ప్రాంతం, చైతన్యనగర్ కాలనీల్లో రూ.42 లక్షల వ్యయంతో వరద నీటి పారుదల కోసం డ్రైనేజీ నిర్మాణం అవసరమని తెలిపారు. శ్రీనగర్ కాలనీలో రూ.19 లక్షలతో వరద నీటి పారుదల పైప్‌లైన్ నిర్మాణం చేపట్టాల్సి ఉందని, ఆల్విన్ కాలనీలో రూ.48 లక్షల అంచనా వ్యయంతో నిర్మించాల్సిన సీసీ రోడ్డు పనుల కోసం ఆరు నెలల క్రితమే జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేసినా ఇప్పటివరకు నిధులు మంజూరు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు.కాలనీల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో సమస్యల తీవ్రతను గుర్తించి పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులకు వెంటనే పరిపాలనా అనుమతులు మంజూరు చేసి పనులను ప్రారంభించాలని అధికారులను కోరారు.

## వడదెబ్బకు వంట మాస్టర్ మృతి

**మిర్యాలగూడ , మే 23:-( ప్రభాత సూర్య):** మిర్యాలగూడ పట్టణం 29వ వార్డుకి చెందిన షేక్ ఇస్మాయిల్(30) వంటల మాస్టర్ శనివారం వడదెబ్బతో మృతి చెందారు మృతుడికి ఒక పాప ఒక బాబు ఉన్నాడు. మిర్యాలగూడలో ఎండలు మండిపోతుండటంతో బజార్లు నిర్మానుష్యమయ్యాయి.



రెక్కాడితే డొక్కాడని నిరుపేద అయిన ఇస్మాయిల్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని మిర్యాలగూడ నియోజకవర్గం యువజన కాంగ్రెస్ అధ్యక్షులు షేక్ అజహరుద్దీన్ కోరారు.

## రైతు కల్లాల వద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపిన రైతులు....

**ఆలేరు, మే 23 (ప్రభాత సూర్య):** ధాన్యం కొనుగోళ్లలో జరుగుతున్న జాప్యాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గంగుల శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో శనివారం ఆలేరు మండలం కొలనుపాక గ్రామంలోని పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద రైతులతో కలిసి నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రైతులు కష్టపడి పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి రోజుల తరబడి ఎదురుచూస్తున్నప్పటికీ ప్రభుత్వం సకాలంలో కొనుగోళ్లు చేపట్టడంలో విఫలమైందని ఆరోపించారు. ధాన్యం తూకం, తరలింపు, చెల్లింపుల ప్రక్రియల్లో తీవ్ర జాప్యం కారణంగా రైతులు ఆర్థికంగా, మానసికంగా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.రైతుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని, కేంద్రాల్లో అవసరమైన సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ధాన్యం కొనుగోలు పూర్తయ్యే వరకు రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో రైతులతో కలిసి మరింత ఉధృతంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమం లో పి ఏ సి ఎస్ చైర్మన్ మొగులగాని మల్లేష్ ,డైరెక్టర్ అరె మల్లేష్ ,గ్రామశాఖ అధ్యక్షులు జంగా స్వామి ,మాజీ ఎంపిటిసి మామిడాల అంజయ్య ,విద్యార్థి విభాగం మండల అధ్యక్షుడు మామిడాల భానుచంధర్, రాజబోయిన కొండల్ రఘుపతి రెడ్డి ,వార్డు సభ్యులు బొంకురి మల్లేష్, బల్లెపు సంపత్ నాయకులు బేధారబోయిన వెంకటేష్, ఎదునూరి భాస్కర్ ,చీరబోయిన పరమేష్ ,శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు



# తల్లాడ కాంగ్రెస్ లో ముదిరిన వర్గ పోరు

### పాత కాంగ్రెస్ నేతల పయనం ఎటు?



**ఖమ్మం( ప్రభాత సూర్య ప్రతినిధి ):** గత పది సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీ అధికారంలో లేకపోయినా అనేక కష్టనష్టాలకు ఓర్చి కాంగ్రెస్ పార్టీని అధికారంలోనికి తీసుకొచ్చిన నాయకులకు సత్తుపల్లి నియోజకవర్గ బాధ్యులు పదవుల విషయంలో ప్రాధాన్యం ఇవ్వకుండా మొండి చేయి చూపటంతో టిఆర్ఎస్ పార్టీ నుంచి తనతో పాటు కాంగ్రెస్లో జాయిన్ అయిన నాయకులకు మాత్రమే ప్రాధాన్యం కల్పించడంతో గత ప్రభుత్వంలో అనేక కేసులు ఎదుర్కొని కాంగ్రెస్ పార్టీని కష్టకాలంలో ఆదుకున్న నాయకులకు ప్రాధాన్యం లేకుండా చేస్తుండడంతో డాక్టర్ మట్టా దయానంద్ ఒంటెద్దు పోకడలతో కాంగ్రెస్ పార్టీకే కాక కార్యకర్తలకు తీవ్ర అన్యాయం చేస్తుండటంతో తల్లాడ మండల కాంగ్రెస్ నాయకులు ఇటీవల హైదరాబాదులో కాంగ్రెస్ అధిష్టానానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కిఫిర్యాదు చేయడంతో అధిష్టానం కాంగ్రెస్ పార్టీ పదవులు నూతన సొసైటీ అధ్యక్షుల నియామకాలను నిలుపుదల చేయడంతో విధి లేక మొక్కుబడిగా సత్తుపల్లిలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో తల్లాడ మండల ముఖ్య కార్యకర్తల సమావేశం పేరిట సభ నిర్వహించి అందులో తనకు అనుకూలమైన కార్యకర్తలతో సీనియర్ కాంగ్రెస్ నాయకులను అసభ్యకరంగా పలు దూషణలు చేయించడంతో సమావేశంలో వాతావరణం వేడెక్కిఅక్కడి సభ అర్ధాంతరంగా తోపులాట జరిగి ఎక్కువమంది కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు మనస్థాపం చెంది అక్కడి సభ నుంచి వెళ్లిపోవడం జరిగింది. అయినను మట్టా దయానంద్ ప్రవర్తనలో మార్పు రాకపోగా పక్షపాత ధోరణితో వర్గ రాజకీయాలకు తావిచ్చి కక్ష సాధింపు ధోరణితో ప్రవర్తిస్తుండటంతో విసిగి వేసారిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ కార్యకర్తలు నిన్న సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కాపా అప్పయ్య ఇంటి వద్ద పాత తరం కాంగ్రెస్ నాయకులు అందరూ మండల పార్టీ అధ్యక్షులు కాపా సుధాకర్ అధ్యక్షతన సమావేశమై భవిష్యత్ కార్యాచరణ నిర్ణయాలను గురించి చర్చించారు.ఈ సందర్భంగా తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాపా సుధాకర్ సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మలీదు కోటేశ్వరరావు తూము వీరభద్రరావు సొసైటీ చైర్మన్ నారా పోగు వెంకట్ గంగాదేవిపాడు మాజీ సర్పంచ్ ఎర్రమల రామ్మోహన్ రెడ్డి సర్పంచ్ ముద్దునూరు కిరణ్ కుమార్ కటికి సర్పంచ్ మల్లారం దమ్మలపాటి ప్రకాష్ రావు ముప్వ రోశయ్య అడపా అనిల్ యూత్ కాంగ్రెస్ నాయకులు గుజ్జర్లపూడి చింటూ వైస్ ప్రెసిడెంట్ మంగాపురం చిత్తలూరి రమేష్ ఐఎన్టియుసి ప్రెసిడెంట్ గోగుల రాఘవ బిసి సెల్ కాంగ్రెస్ మండల ప్రెసిడెంట్ ధర్మ సోత్ దశరద్ నాయక్ లు మాట్లాడుతూ పార్టీ కష్ట కాలంలో ఉన్నప్పుడు ఆదుకొన్న పాత కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు పార్టీ పదవుల్లో ప్రాధాన్యత కల్పించాలని వర్గ విభేదాల వల్ల ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో అనేక పంచాయతీలను కోల్పోవడం జరిగిందని దీనికి కారణం నాయకుల ఒంటెద్దు పోకడలు కారణమని కనీసం రాబోయే ఎంపీటీసీ మరియు జడ్పిటిసి ఎన్నికలలో అందరూ సమన్వయంతో కృషిచేసి ముందుకు పోవాలని ముక్త కంఠంతో కోరినారు. లేకపోతే తమ దారి తాము చూసుకుంటామని గ్రామస్థాయి నాయకులకు కనీస గుర్తింపు లేకపోవడం అభివృద్ధి పనులకు సైతం ఆహ్వానించకుండా శుభకార్యాల విషయంలో కూడా రాజకీయాలు చూపిస్తూ అసలైన కార్యకర్తలను విస్మరిస్తూ ఇప్పటికైనా గ్రూప్ రాజకీయాలు లేకుండా అందర్నీ కలుపుకొని పోవాలని కోరినారు. ఇప్పటికైనా మేల్కొని ఏకపక్ష ధోరణి విడనాడి సమర్థులైన కాంగ్రెస్ పార్టీ సీనియర్ కార్యకర్తలను గుర్తించి పార్టీ పదవుల్లో వివిధ నామినేటెడ్ పార్టీ పదవుల్లో తగిన ప్రాధాన్యత ఇవ్వవలసినదిగా కోరుతూ ఈ సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో తల్లాడ మండలంలోని అన్ని గ్రామాల నుంచి అధిక సంఖ్యలో కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# హరీష్ రావువి పగటి కలలు

**అధికారంలోకి రావడం కల్ల**

**ఫ్యూచటర్ సిటీపై బాధ్యాతారాహిత్య ప్రకటన**

**అభివృద్ధిని అడ్డుకోవడమే లక్ష్యంగా బిఆర్ఎస్**

**మండిపడ్డ మంత్రి శ్రీధర్ బాబు**



**హైదరాబాద్:** ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామని బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు బాధ్యతా రాహిత్యంగా మాట్లాడుతున్నారని మంత్రి శ్రీధర్‌బాబు విమర్శించారు. ఇది బ్లాక్ మెయిల్ రాజకీయమని మండిపడ్డారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలా? వద్దా? ఆయన చెప్పాలన్నారు. 'ఇలా చేస్తే పెట్టుబడులు రావు. పక్క రాష్ట్రాలకు వెళ్తాయి. ఫ్యూచర్ సిటీలో కాలుష్యకారక పరిశ్రమలు ఉండవు. దాన్ని రద్దు చేస్తామనడం ఎంత వరకు సమంజసం అని ప్రశ్నించారు. తమ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని బీఆర్ఎస్ అడ్డుకుంటోందని మంత్రి ఆరోపించారు. ఆ పార్టీ బ్లాక్‌మెయిలింగ్ రాజకీయాలకు యత్నిస్తోందన్నారు. ప్రభుత్వం ఏర్పడిన మొదటిరోజు నుంచే బీఆర్ఎస్ నేతలు విమర్శలే ప్రధాన అంశంగా ముందు కెళ్తున్నారని తెలిపారు. జంట నగరాలకు సంబంధించిన మెట్రోను విస్తరించాలనుకుంటే అడ్డుకుంటున్నారని బీఆర్ఎస్ పార్టీ నేతలపై మంత్రి శ్రీధర్ బాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నేతలు చీప్ పాలిటిక్స్.. బ్లాక్ మెయిల్ పాలిటిక్స్ చేయొద్దని అన్నారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. ఎక్కడ అభివృద్ధి చేస్తే అక్కడ ఆపుతామంటే ఎలా అని ప్రశ్నించారు. ప్రజలు కోరుకున్నది తప్పకుండా చేసి తీరుతామన్నారు. వేలాది కోట్లు పెడతామని మల్టీ నేషనల్ కంపెనీలు వస్తున్నాయని.. ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామంటే పెట్టుబడిదారులు భయపడరా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో కాంగ్రెస్ తెచ్చిన మెట్రోనే ముందుకు సాగిందని మంత్రి తెలిపారు. తాము ఎన్ని కిలోమీటర్లు తెచ్చామో అన్ని కిలోమీటర్లు మాత్రమే మెట్రో వచ్చిందని చెప్పారు. మెట్రోను విస్తరిద్దామంటే అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. పెరిగిన జనాభాకి అనుగుణంగా మెట్రో విస్తరించకూడదా అని ప్రశ్నించారు. అధికారంలోకి వస్తామని మాజీ మంత్రి హరీశ్ రావు పగటి కలలు కంటున్నారని విమర్శించారు. అసెంబ్లీ, పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోయిందని.. అయినా ఆ పార్టీ నేతల బుద్ధి మారడం లేదని వ్యాఖ్యానించారు. నగరాన్ని విస్తరించాలని ప్రభుత్వం భావిస్తోందని మంత్రి తెలిపారు. ప్రజల అవసరాలను తీర్చడానికి ప్రణాళికలు రూపొందించామన్నారు. ఇతర నగరాల అభివృద్ధిపై అధ్యయనం చేశామన్నారు. రాబోయే తరాలకు ఉపయోగపడే కార్యాచరణ చేపట్టాలని నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడానికే బీఆర్ఎస్ ప్రయత్నం చేస్తోందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని అడ్డుకోవాలని బీఆర్ఎస్ ప్రయత్నిస్తోందని మంత్రి ఆరోపించారు. ఓటమితో ఎదురైన నిరాశ నుంచి ఇప్పటికీ బయటకి రాలేకపోతున్నారన్నారు. బుల్లెట్ ట్రైన్ తెస్తామంటే.. ఎందుకని బీఆర్ఎస్ నేతలు అడ్డుపడుతున్నారని ఫైర్ అయ్యారు. తెలంగాణ యువతకు మంచి భవిష్యత్తు ఇవ్వొద్దా అని అన్నారు. స్వార్థ రాజకీయాలే తమకి ముఖ్యమని బీఆర్ఎస్ నేతలు భావిస్తున్నారని మంత్రి శ్రీధర్ బాబు విరుచుకుపట్టారు.

# యువత ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలి

**దేశవ్యాప్తంగా రోజ్‌గార్ మేళాలో 51 వేల మందికి ఉద్యోగాలు**

**ఇప్పటివరకు 12.5 లక్షల మందికి ఉద్యోగావకాశాలు**

**19వ రోజ్‌గార్ మేళాలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి**



**హైదరాబాద్:** దేశవ్యాప్తంగా 47 ప్రాంతాల్లో జరిగిన రోజ్‌గార్ మేళాలో 51 వేల మందికి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. యువత స్వయం సమృద్ధి సాధించి ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. శనివారం నాడు బోయిగూడలోని రైల్ కళారంగ్‌లో జరిగిన 19వ రోజ్‌గార్ మేళాలో కేంద్ర మంత్రి పాల్గొని ప్రసంగించారు. ఈరోజు 220 మంది కొత్తగా ఉద్యోగాల్లో చేరుతున్నారన్నారు. 2022లో దీపావళి రోజున మొదలైన రోజ్‌గార్ మేళా ద్వారా ఇప్పటివరకు 12.5 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించామని వెల్లడించారు. ఇది కేవలం ఉద్యోగాల కార్యక్రమం కాదని, యువత భవిష్యత్తు కోసం మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన పెద్ద మిషన్ అని చెప్పుకొచ్చారు. ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు ప్రైవేట్ కంపెనీల్లో కూడా కోట్ల సంఖ్యలో ఉద్యోగాలు వస్తున్నాయని అన్నారు. స్టార్టప్స్, యూనికార్న్‌ వల్ల యువత ఉద్యోగాలు అడిగే స్థాయి నుంచి ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి వచ్చిందని కేంద్రమంత్రి అన్నారు. రోడ్లు, ఎయిర్‌పోర్టులు, రైల్వేలు, మెట్రోలు, ఇండస్ట్రియల్ కారిడార్లు వంటి ప్రాజెక్టులతో భారీగా ఉపాధి పెరుగుతోందన్నారు. దేశంలో ప్రతి సంవత్సరం రూ.12 లక్షల కోట్ల ఇన్‌ఫ్రా పనులు జరుగుతున్నాయని వివరించారు. ప్రతి లక్ష కోట్ల పెట్టుబడికి 14 నుంచి 15 లక్షల ఉద్యోగాలు వస్తున్నాయన్నారు. యువతను మోదీ 'వికసిత భారతానికి సూపర్ హీరోలు'గా చూస్తున్నారని అన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా కోట్ల మంది యువతకు శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. గ్రామీణ యువతకు కూడా ఏఐ, ఎవి వంటి ఆధునిక టెక్నాలజీని మాతృభాషలో నేర్పిస్తున్నామని తెలిపారు.భారత యువత ప్రపంచస్థాయిలో రాణిస్తోందని కిషన్ రెడ్డి అన్నారు. సెమీకండక్టర్లు, స్పేస్, డ్రోన్ టెక్నాలజీలో భారత్ ముందుకు వెళ్తోందన్నారు. చంద్రుడి దక్షిణ ధృవానికి ముందుగా చేరిన దేశం భారత్ అని చెప్పుకొచ్చారు. 'ఆపరేషన్ సిందూర్' సమయంలో స్వదేశీ డ్రోన్లు శత్రు క్షిపణులను అడ్డుకున్నాయని అన్నారు. 2047 నాటికి వికసిత భారత్ లక్ష్య సాధనలో యువత పాత్ర కీలకమన్నారు. యూనివర్సిటీలు, కాలేజీలు, పీఎం-శ్రీ స్కూల్స్ సంఖ్య పెంచామని తెలిపారు. భారత్ ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగిందని అన్నారు. 2014కు ముందు వందల స్టార్టప్స్ మాత్రమే ఉండగా, ఇప్పుడు 1.2 లక్షలకు పైగా ఉన్నాయన్నారు. మైనింగ్, బొగ్గు రంగాల్లో కూడా మంచి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని యువతకు సూచించారు. మైనింగ్, ఇంజనీరింగ్ వంటి కోర్సులపై యువత దృష్టి సారించాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సూచనలు చేశారు.